స్థానిక సమస్యలు పరిష్కరించాలి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న వాసవీనగర్ వాసులు

బోడుప్పల్: వాసవీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ అధ్యక్షుడు మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ శనివారం బోడుప్పల్ మేయర్ అజయ్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. వాసవీనగర్ వీధినెంబర్ 6లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మా కాలనీ పార్కులో షెడ్డు, కాలనీ అనుకుని ఉన్న స్థలంలో ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఖాళీ స్థలాల్లో చెత్త, చెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉంటుందని, కాలనీ ప్రధాన కూడళ్లలో రెండు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, ఎన్నికల సమయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు కనెక్షన్ ఇవ్వాలని కోరారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్, వాసవీనగర్ ఉపాధ్యక్షులు కిశోర్‌కుమార్ తదితరులున్నారు.

జనవిజ్ఞాన వేదిక సైన్స్ సంబరాలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కాప్రా: జనవిజ్ఞాన వేదిక కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో ఏఎస్‌రావునగర్‌లో చెకుముకి సైన్స్ సంబరాలు–2024 నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్ థెరిసా హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. కాప్రా మండలం ఎంఈఓ బాపురెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పరీక్షపత్రాన్ని ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంఈఓ బాపురెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు. జనవిజ్ఞానవేదిక కాప్రా మండల కమిటీ సభ్యులు, సెంట్ థెరిసా హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులతో కౌశిక్‌రెడ్డి



క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేందుకు కృషి చేయాలని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ టెక్నికల్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రాథమిక స్థాయి విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇలాంటి పోటీల వల్ల విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. క్రీడల్లో రాణించేందుకు ప్రత్యేక తర్ఫీదును పొందాలన్నారు. ఇతర బ్రాంచి విద్యార్థులు ఈ క్రీడ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. సీనియర్ ప్రిన్సిపాల్ సునీత, పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రామంతాపూర్: ప్రగతినగర్‌లో సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో వార్షిక క్రీడాపోటీలు నిర్వహించారు. శనివారం జరిగిన ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా భారత ప్రభుత్వ రక్షణశాఖ భారత్ డైనమిక్ సంస్థ సీనియర్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రాధాన్యతను ఇచ్చి తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొందాలని సూచించారు. అనంతరం కరస్పాండెంట్ సునీల్‌తో కలిసి క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ డైరెక్టర్ ప్రవీణ్‌దేవ్, ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి, వై.నాగేశ్వర్‌రావు, స్వామి, సౌమ్య, శివాజీ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

మల్లాపూర్: జీహెచ్ఎంసీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని శనివారం జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌కు కాప్రా సర్కిల్ అధ్యక్షులు కుర్మన్న వినతి పత్రం అందజేశారు. కార్మికుల ఉద్యోగ భద్రత, సరిపడ యంత్ర పరికరాలు, పనిముట్లను వారికి ఇవ్వాలని కోరారు.

తవ్వారు.. మరిచారు

ఇబ్బంది పడుతున్న ప్రజలు • పట్టించుకోని అధికారులు

గతుకుల రోడ్లు, వ్యక్తిగత సమస్యలకు తోడు సామన్యుడికి కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల సమన్వయలోపంతో రోడ్లను ఇష్టానుసారంగా తవ్వి వదిలేయడంతో పలు కాలనీల్లోని ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సీసీరోడ్లు వేసిన తర్వాత పైపులైన్లు వేయడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారడంతో వాహనాలు దెబ్బతిన్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఏళ్లతరబడి తవ్వి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడి నిత్యం నరకం చూస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని కాలనీవాసులు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



దెబ్బతిన్న కారు టైరు



గుంతలో దిగబడ్డ టిప్పర్



విఘ్నేశ్వర్‌నగర్ కాలనీలో అధ్వానంగా రోడ్డు

మౌలాలి: డివిజన్ విఘ్నేశ్వర్‌నగర్ కాలనీలో గత రెండేళ్ల క్రితం భూగర్భ డ్రైనేజీలు వేశారు. తదానంతరం సీసీరోడ్డు నిధులు మంజూరైనా రోడ్డు వేయకపోవడంతో అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షం వస్తే బయటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఎటు చూసినా ప్రమాదం భారీన పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులపై స్పందన కరువు..

అధికారులు, ప్రజాప్రతినిధులు కాలనీకి వచ్చి కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. స్థానిక కార్పొరేటర్‌కు పలుసార్లు ఫిర్యాదులు చేశామన్నారు. ప్రజా ప్రతినిధులెవరూ పట్టించుకోవడం లేదని, కేవలం ఓట్లకోసమే పర్యటిస్తారని వాపోయారు.

మా కష్టాలు కనిపించవా..

'కాలనీ వాసులమంతా ట్యాక్స్‌లు కడుతున్నాం. అయినా కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు విఘ్నేశ్వర్ నగర్‌కాలనీ కనిపించడం లేదా'..! అని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

బయటికి రాలేకపోతున్నాం..

కాలనీలోని రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఇళ్లలోంచి బయటికి రావాలంటేనే గుండె గుబేలుమంటోంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం..



కాలనీలో సమస్యలను పరిష్కారంలో స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారు. విఘ్నేశ్వరనగర్ కాలనీలో ఉన్న 4 రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలకు శాపంగా మారింది. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సీసీరోడ్డు ఏర్పాటు చేయాలి.
– భగవంత్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌నగర్ కాలనీ

మా గోడు పట్టదా..



రెండేళ్లు గడుస్తున్నా భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు, నేటికీ రోడ్డు వేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు.
– నర్సింగ్‌రావు, విఘ్నేశ్వర్‌నగర్ కాలనీ

నీటిని సంరక్షించుకుందాం !

మల్కాజిగిరి: నీటిని సంరక్షించుకోవడానికి ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. శనివారం విష్ణుపురికాలనీలో జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. కచ్చ మోరీల వద్ద సిల్ట్ వదిలివేయకుండా తొలగించాలన్నారు. ఓపెన్‌నాలా ఉన్న ప్రాంతంలో యూజీడీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. మేనేజర్ నవీన్, రవి, విజయ్‌కుమార్, రాజేష్, యాకూబ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖబరస్తాన్ అభివృద్ధికి నిధులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లోని ఖబరస్తాన్‌లో బండ రాళ్ల తొలగింపునకు రూ.18 లక్షల నిధుల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తూ.. శనివారం స్థానిక ముస్లింలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి శాలువా కప్పి సత్కరించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

రామంతాపూర్: శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో శనివారం మహేష్‌గురు స్వామి, నారాయణ గురుస్వామిల ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ (భిక్ష) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ కోట్ల నరసింహారెడ్డి, శంకర్, రుద్రనైతిక్, రమేష్ గురుస్వాములు పాల్గొన్నారు.

నాచారంలో..

మల్లాపూర్: నాచారంలోని శ్రీరామ్ ఫర్నిచర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, గ్రేటర్ బీఆర్ఎస్ నేత సాయిజెనోశేఖర్ పాల్గొన్నారు.



పడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

దివ్యాంగులకు చేయూత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న స్వామి

మల్కాజిగిరి: సత్యసాయిబాబా జయంతి సందర్భంగా మల్కాజిగిరి సత్యసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సేవా సమితి సభ్యుడు ఏవిస్వామి మాట్లాడుతూ.. సేవాతత్పరతకు సత్యసాయిబాబా మార్గదర్శకంగా నిలిచారని, ఆయన బాటలో నడవడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలన్నారు. ఏవీ దుర్గాప్రసాద్, కనక దుర్గాభవాని, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప్పల్ చర్చెస్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఉప్పల్: ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లో కేకేఆర్ గార్డెన్‌లో డిసెంబర్ 27న నిర్వహించే సముద్ర జల ప్రవాహం పండుగ పోస్టర్‌ను శనివారం ఉప్పల్ 'చర్చెస్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో విడుదల చేశారు. శ్రీనగర్ కాలనీ హోలి టెంపుల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పాస్టర్లు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాస్టర్ జోసెఫ్ హాజరవుతారని తెలిపారు. గోన పిలిప్స్, జెరుసలెం మత్తయ్య, జీడిపల్లి హోహాస్, తేజోమయ, డేవిడ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబురాలు



మల్లాపూర్: మహారాష్ట్రలో బీజేపీ విజయం సాధించడంతో శనివారం మల్లాపూర్‌లో ఆ పార్టీ నేతలు విజయ సంబరాలు చేసుకున్నారు. పటాసులు కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. మల్లాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆంజనేయులు, నరసింహ, గంగాధర్, తిరుపతిరెడ్డి, క్రాంతి, దొడ్డి యాదగిరి,సతీష్‌గౌడ్, నిర్మల తదితరులున్నారు.

హ్యాండ్ బాల్‌లో విద్యార్థిని ప్రతిభ

అల్వాల్: జాతీయస్థాయి అండర్–14 హ్యాండ్ బాల్ పోటీలకు దేవుని అల్వాల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన అంజన సౌమ్య ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన అండర్–14 హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జట్టు తరుపున అంజనసౌమ్య ప్రతిభ కనబరిచి ఈనెల 25 నుంచి 29 వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని మహాశీముందు జిల్లాలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సదానంద్, ప్రిన్సిపల్ జ్యోతి, శ్యామ్యూల్, పీఈటీ రమేష్‌లు అభినందించారు.

స్థానిక సమస్యలపై జెడ్సీ పర్యటన



స్థానికులతో జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ డివిజన్‌లో శనివారం స్థానిక కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డితో కలిసి ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులు, ఈఈ హరిలాల్‌లతో కలిసి పర్యటించారు. దేవేందర్ నగర్, ఇందిరానగర్, శేషసాయినగర్, పద్మావతి కాలని, మల్లికార్జున నగర్ తదతర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. బోడుప్పల్ నుంచి ఉప్పల్ నల్ల చెరువులో కలుస్తున్న మురుగుతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు జెడ్సీ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రాధాన్యతను బట్టి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఏఈ మౌనిక, కాలనీ అధ్యక్షులు చింతల శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దేవిరెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు నష్టం జరిగితే సహించబోం'



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో బాక్స్‌డ్రైన్ పనులు సరైన ప్రణాళిక లేకుండా అధికారులు మ్యాప్ చేశారని, దీనివల్ల తక్కువ విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు నష్టం కలుగుతోందని స్థానికులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కోరారు. శనివారం అధికారులతో కలిసి బాక్స్‌డ్రైన్ స్థలాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. పేదలకు నష్టం కలిగించే ఏ ఒక్క పనికైనా తన సహకారం ఉండదని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ మార్గం నుంచి బాక్స్‌డ్రైన్‌నిర్మించేలా మ్యాపింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈ సత్యలక్ష్మి, సీనియర్ నేత బద్దం పరశురామ్‌రెడ్డి, చందు, శేఖర్‌గౌడ్, శ్రీను, సాయిగౌడ్, రాజు తదితరులున్నారు.

అనారోగ్యానికి నిలయాలుగా హోటళ్లు !

తగిన చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

అల్వాల్: ఆకలి తీర్చుకోవడానికి హోటల్‌కు వెళ్తే అనారోగ్యాల పాలు కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు వాపోతున్నారు. అల్వాల్‌లోని ఓ హోటళ్లలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా వినియోగదారుల ప్రాణాలతో హోటళ్ల నిర్వాహకులు చెలగాటం ఆడుతున్నారనే విమర్శలున్నాయి.

- 15 రోజుల క్రితం లోతుకుంటలోని ఓ షవర్మ విక్రయ కేంద్రంలో షవర్మ తిన్న వినియోగదారులు ఆసుపత్రి పాలు కాగా.. శనివారం ఓల్డ్ అల్వాల్‌లోని ప్రముఖ హోటళ్లలో బిర్యాని తింటుండగా బొద్దింక వచ్చింది. ఈ విషయమై హోటల్ నిర్వాహకులను ప్రశ్నించడంతో పాటు లోపలికి వెళ్లి చూడగా.. అన్ని నిల్వ ఉన్న పదార్థాలు కనిపించాయి. కొన్ని బూజుపట్టి కుళ్లిపోయే స్థితిలో ఉన్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.



నిల్వ ఉంచడంతో బూజుపట్టిన కర్రీ

వరుస ఘటనలు..

ఇలాంటి వరుస ఘటనలు తరచూ జరుగుతున్న ఆహార భద్రత అధికారి, జిల్లా వైద్యాధికారి బృందాలు సైతం తనిఖీలు చేయకపోవడం గమనార్హం. సంబంధిత అధికారులు స్పందించి ఆహార విక్రయ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, YADADRI-BHUVANAGIRI: AT BHONGIR
O.S.No.68 OF 2023
Between:
Ponna Balraj ... Plaintiff
AND
Ponna Anjaneyulu and others ... Defendants
To
16. Sama Navaneetha, W/o. S. Madan Mohan Reddy, Age 42 years, Occ: House Wife, R/o. H.No.10-112, P&T Colony, Medipally Village and Mandal, Medchal-Malkajgiri District.

NOTICE

That the above case is filed by the plaintiff against the defendants for Partition and Separate Possession of 1/18th share of the plaintiff out of the Suit "A" and "B" Schedule Properties and also to declare the Regd Documents as null and void and not binding on him and also rectification of Revenue Records in respect of part of the suit "B" schedule property and said matter is posted on 06-12-2024 for your appearance. If you fail to appear on 06-12-2024 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, the matter will be decided exparte as per law.
(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/- S. SREEKANTH
K. NARESH KUMAR
ADVOCATES: BHONGIR
Cell : 9391099207

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE, YADADRI-BHUVANAGIRI: AT BHONGIR
I.A.NO.644 OF 2023
IN
O.S.No.68 OF 2023
Between:
Ponna Balraj ... Petitioner/ Plaintiff
AND
Ponna Anjaneyulu and others ... Respondents/ Defendants
To
16. Sama Navaneetha, W/o. S. Madan Mohan Reddy, Age 42 years, Occ: House Wife, R/o. H.No.10-112, P&T Colony, Medipally Village and Mandal, Medchal-Malkajgiri District.

NOTICE

That the above case is filed by the petitioners/ plaintiff against the respondents/ defendants for Partition and Separate Possession of 1/18th share of the petitioner/ plaintiff out of the Suit "A" and "B" Schedule Properties and also to declare the Regd Documents as null and void and not binding on him and also rectification of Revenue Records in respect of part of the suit "B" schedule property and also the above IA and said matter is posted on 06-12-2024 for your appearance. If you fail to appear on 06-12-2024 at 10.30AM before the above said Hon'ble Court either in person or through your advocate, the matter will be decided exparte as per law.
(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/- S. SREEKANTH
K. NARESH KUMAR
ADVOCATES: BHONGIR
Cell : 9391099207

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ పారిశ్రామికవాడ 11 కేవీ నవభారత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం10.30 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నవభారత్, చెమేవిడా లేన్, అశోక్ లేలాండ్, డీఎస్ఎల్ మాల్‌బూకల్కి భవన్, సాబు ఆర్‌కేఎస్, గోల్కొండ ప్రెస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

లిటిల్ ఫ్లవర్ కళాశాలకు 'న్యాక్- ఏ' గ్రేడ్

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలకు న్యాక్– ఏ గ్రేడ్ ప్రకటించిందని ప్రిన్సిపల్ జయంతి రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ అరుణ్ ప్రకాశ్‌లు తెలిపారు. డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ బృందం, విద్యా ప్రమాణాలు పాటిస్తూ.. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు, అధునాతన పద్ధతుల్లో బోధనతో విద్యార్థులను పరిపూర్ణంగా తీర్చిదిద్దుతున్న ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ యాజమాన్యాన్ని ప్రశంసిస్తూ.. ఏ గ్రేడ్‌ను ప్రకటించిందని, శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

నేడు బ్రాహ్మణ కార్తీక వన భోజనాలు

రామంతాపూర్: మహా భాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు ఘట్‌కేసర్, కొండాపూర్‌లోని బోయిన్‌పల్లి, మల్లారెడ్డి లక్ష్మమ్మ వ్యవసాయక్షేత్రంలో నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షులు మహాదేవభట్ల లక్ష్మణ్ ప్రసాద్‌శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9391111203.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నృత్య ప్రవంతి కూచిపూడి నృత్య కళాక్షేత్రం గురువు తాదూరి ప్రవంతి శిష్యబృందంచే నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

హోమియో వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

రామంతాపూర్: ప్రభుత్వ ఆయుష్ కమిషనర్‌గా నియమితులైన చుట్టం లక్ష్మిని శనివారం రాష్ట్ర హోమియో డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చినుకాని శివప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ప్రభుత్వ హోమియోపతి వైద్యులు, పీజీ విద్యార్థుల స్కాలర్‌షిప్ మెడికల్ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే సమస్యలు వెంటనే పరిష్కరించేలా కృషిచేస్తానని సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శరత్, ఉపాధ్యక్షులు డాక్టర్ వివేక్, డాక్టర్ ప్రదీప్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కాప్రా: ప్రజా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. శనివారం కాప్రా డివిజన్‌లోని నిర్మల్‌నగర్, సప్తగిరికాలనీ ఇండియన్ ఓవర్సీస్ కాలనీల్లో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

మహిళల ఆర్థిక పరిపుష్టితోనే సమాజాభివృద్ధి

కుషాయిగూడ: మహిళలు స్వయం ఉపాధి మార్గాలు ఎంచుకుని ఆర్థిక పరిపుష్టి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. డివిజన్‌లో మహిళలకు స్వయం ఉపాధి మార్గాలు చూపాలనే ఆశయంతో 10 మందికి సొంత నిధులతో కార్పొరేటర్ ఆధునిక గ్రైండింగ్ యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ యంత్రాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందడంతో పాటు మరికొంత మందికి ఉపాధి చూపే స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. సత్తమ్మ, నవనీత, సంధ్య, నిర్మల, అరుణ, మున్ని, గిరిజ, శిరీష పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మల్లాపూర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నీలం శంకర్‌రావు కుమారుడు నీలం రాహుల్ (24) నాచారంలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. మల్లాపూర్ నుంచి హబ్సిగూడ వైపు అతివేగంగా వెళ్తున్న ఇసుక లారీ (టీఎస్08 యూఏ 0234) బైక్‌పై వెళ్తున్న రాహుల్‌ను నాచారం రాంకీ టిఫిన్ సెంటర్ వద్ద ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ అతడిని 108 సాయంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బేగంపేట్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పెట్రోల్ పంపులో గొడవ

మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

మేడిపల్లి: చెంగిచెర్లలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌లో లక్ష్మీనారాయణ అనే వ్యక్తి బండిలో పెట్రోల్ పోసుకుని వెళ్తుండగా.. వెనుక ఉన్న యువకుడి బైక్‌కి లక్ష్మీనారాయణ బైక్ తగిలింది. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో బైక్ తాళం తీసుకున్న సదరు యువకుడు 'మానాన్న ఏసీపీ అని ఘటనా స్థలానికి ఏసీపీ అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి పిలిపించాడు. దీంతో ఆవేశంతో వచ్చిన ఏసీపీ తన వాహనంలో ఎక్కించే ప్రయత్నం చేశాడని స్థానికులు చెబుతున్నారు. బాధితులు మేడిపల్లి పోలీసులకు ఆక్టోపస్ అరుణ్‌కుమార్ పై ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులను సంప్రదించగా సదరు పోలీస్ అధికారి వారితో రాజీపడినట్లు సమాచారం.